## ఘనంగా సురేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు



నస్రుల్లాబాద్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నస్రుల్లాబాద్, డిసెంబర్ 17: మండల కేంద్రం లోని బస్టాండు ఆవరణలో ఆదివారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి జన్మ దిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పటాకులు కాల్చి సంబురాలు చేసుకొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కంది మల్లేశ్, సర్పంచుల ఫోరం మండల అధ్య క్షుడు రాము, నాయకులు మైశాగౌడ్, రాములు, సాయిలు, బాలమల్లుగౌడ్, నారాయణ, నర్సి హులు గౌడ్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 17: బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో ఆదివారం శ్రవణ నక్షత్రం సందర్భంగా గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెండ్లిపెద్దలుగా కర్ణకంటి వీరయ్య దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు నందకిశోర్ ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

## అయ్యప్ప పడిమెట్లు వితరణ



అయ్యప్ప స్వాములకు పడిమెట్లు అందిస్తున్న దాత హనుమాన్‌రెడ్డి

రాజంపేట్, డిసెంబర్ 17: గ్రామంలోని అయ్యప్ప స్వాములకు అయ్యప్ప పడిమెట్లు, స్వామివారి అలంకరణ టేబుల్‌ను కామారెడ్డి పట్టణానికి చెందిన అయ్యప్ప భక్తుడు హనుమాన్ రెడ్డి ఆదివారం అందజేశారు. గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో అయ్యప్ప స్వాములు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పడిమెట్లు,స్వామివారి అలంకరణ టేబుళ్లను అందించినట్లు హనుమాన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు హనుమాన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురు స్వాములు ఆముద నాగరాజు,ఆద్యాల రమేశ్, బద్దం ప్రవీణ్‌కుమార్, పాశం స్వామి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో మరుగుదొడ్లు

### పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



నిర్మాణ దశలో ఉన్న మరుగుదొడ్లు

బిచ్కుంద, డిసెంబర్ 17: మండల కేంద్రం లోని ప్రయాణ ప్రాంగణంలో నిర్మించిన మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. రాష్ట్ర సరిహద్దుతోపాటు జుక్కల్ నియోజకవర్గానికి కేంద్రబిందువైన బిచ్కుంద మీదుగా మహారాష్ట్ర, కర్ణాటక నుంచి ప్రజలు రోజూ వేల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. బస్టాండ్‌లోని మరుగుదొడ్లు సరిగా లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు కూలి మీదపడతాయోనని భయాందోళనకు చెందుతున్నారు. దీనికి తోడు నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఆర్టీసీ అధికారులు స్పందించి నూతనంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లను త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

## నేడు కాకతీయ కాలువకు నీటి విడుదల

మెండోరా, డిసెంబర్ 17 : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి యాసంగి పంటలకు కాకతీయ కాలువ ద్వారా సోమవారం ఉదయం నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు ఏఈఈ రవి తెలిపారు. కాకతీయ కాలువ ద్వారా వదిలిన నీటిని రైతులు పంటల కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. అంతేగాకుండా కాకతీయ కాలువ నీటి విడుదలతో కాకతీయ కాలువకు అనుసంధానంగా ఉన్న జెన్‌కో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు (90.313 టీఎంసీలు) కాగా ఆదివారం సాయంత్రానికి 1088.60 అడుగులు (78.342 టీఎంసీలు) నీటి నిల్వ ఉందన్నారు.

## చరిత్ర గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న వేదుల నర్సింహం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 17 : నగరంలోని కోటగల్లీలో కందకుర్తి యాదవ్‌రావు ఇంట్లో అస్మక చరిత్ర గ్రంథాలయాన్ని ఇతిహాస సంకలన సమితి–ఇందూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర సంఘటన మంత్రి వేదుల నర్సింహం ముఖ్యఅతిథిగా హాజరై గ్రంథాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. కందకుర్తి యాదవరావు 90వ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణలోనే మొట్టమొదటి చరిత్ర గ్రంథాలయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. చరిత్ర అధ్యయనం అనేది యజ్ఞంతో సమానమైనదని, చరిత్ర అధ్యయనం కోసం కందకుర్తి యాదవ్‌రావు తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. హిందీ, తెలుగు, మరాఠీ, ఆంగ్లం భాషలకు సంబంధించి 3 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని సంస్థ కార్యదర్శి ఆనంద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారిణి శైలి బెలాల్, తాటి వీరేశం, మోహన్ దాస్, రుషి తదితరులు పాల్గొన్నారు.

## అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందేలా కృషిచేయాలి

- భారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి అశ్విన్ శ్రీవాత్సవ
- వికసిత్ భారత్ సంకల్పయాత్రకు విశేష స్పందన



కంజర గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

మోపాల్ (ఖలీల్‌వాడి) / ఇందల్వాయి, డిసెంబర్ 17 : ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాల ఫలాలు అట్టడుగు వర్గాల వారికి అందేలా కృషి చేయాలని భారత ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి అశ్విన్ శ్రీవాత్సవ అన్నారు. అర్హులైన వారు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకున్నప్పుడే ప్రభుత్వ సంకల్పం నెరవేరి, ఆయా పథకాలకు సార్థకత చేకూరుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వీలుగా చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రను మోపాల్ మండలం కంజర, డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లిలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జిల్లాలోని 530 గ్రామపంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, సంకల్ప యాత్రను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా గ్రామ, జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పారు. సంకల్పయాత్ర సందర్భంగా అర్హులకు పథకాలతో లబ్ధి చేకూర్చేలా చూస్తున్నామని తెలిపారు. ఆయా గ్రామాల్లోని ప్రజల నుంచి వివిధ పథకాల కింద దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లను ఆవిష్కరించి, గ్రామస్తులకు పంపిణీ చేశారు. ఉచిత ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధ, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, ఎన్‌వైకే కో–ఆర్డినేటర్ శైలి బెల్లాల్, డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న, సర్పంచ్ నర్సయ్య, ఎంపీటీసీ సౌమ్య, ఎంపీడీవో గోపి, మోపాల్ ఎంపీవో ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.